

కేక్ కట్ చేస్తున్న మాజీ ఎంపీ రావులకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న కేటీఆర్, నాయకులు

## కేటీఆర్ సమక్షంలో రావుల బర్త్‌డే సెలబ్రేషన్

వనపర్తి టౌన్, జూన్ 10 : హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మాజీ ఎంపీ, బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి రావుల చంద్రశేఖర్ రెడ్డి జన్మదిన వేడుకలను మంగళవారం ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా రావుల చంద్రశేఖర్‌రెడ్డికి కేటీఆర్ కేక్ తినిపించి శాలువాతో ఘనంగా సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. రావుల నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని వారి రాజకీయ అనుభవం పార్టీకి ఉపయోగపడాలని కోరారు. కేంద్ర కార్యాలయంలో పార్టీ కార్యక్రమాలు సమన్వయం చేస్తూ తన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని కేటీఆర్ ప్రశంసించారు. అదేవిధంగా బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ నాయకులు రావులకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు రైతులతో కలిసి వినతి పత్రం అందిస్తున్న విజయ్

## మోసపోతున్న సీడ్ పత్తి రైతులు

- కంపెనీలు, ఆర్గనైజర్లు కుమ్మక్కై మోసం చేస్తుండ్రు
- మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు దృష్టికి తీసుకెళ్లిన బీఆర్ఎస్ నేత కుర్వ విజయ్ కుమార్

గద్వాల, జూన్ 10 : గద్వాల జిల్లాలో సీడ్ పత్తి సాగు చేసిన, విత్తనాలు ఫెయిల్ అయిన తమకు న్యాయం చేయాలని పలువురు రైతులు కోరారు. మంగళవారం రైతులతో కలిసి బీఆర్ఎస్ రాష్ట్ర నేత కుర్వ విజయ్‌కుమార్ హైదరాబాద్‌లో మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, రాష్ట్ర రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. సీడ్ పత్తి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. జిల్లాలో సీడ్ పత్తి రైతులను కంపెనీలు చేసిన మోసంతో ప్రస్తుతం వారి కుటుంబాలు రోడ్డు పాలయ్యాయని వాపోయారు. కంపెనీలు నేరుగా సీడ్ విత్తనాలు రైతులకు ఇవ్వకుండా దళారులుగా ఆర్గనైజర్లను నియమించుకొని మాఫియాలా వ్యవహరిస్తున్నాయన్నారు. దీంతో అమాయకపు రైతులు మోసపోతున్నారన్నారు. గతేడాది కంటే ఈసారి ప్యాకెట్ ధర తగ్గించడం చూస్తుంటే రైతులను సీడ్ సాగుకు దూరం చేయడమే అన్నారు. పెరుగుతున్న ఖర్చులకు అనుగుణంగా ధరలు పెంచాలి.. కానీ తగ్గిస్తున్నారని ఆగ్రహం చెందారు. సీడ్ పంట పాస్ అయినా ఫెయిల్ అయ్యిందంటూ విత్తనాలకు డబ్బులు ఎగ్గొట్టే ప్రయత్నం కంపెనీలు, ఆర్గనైజర్లు చేస్తున్నారన్నారు. ఈ ప్రక్రియ ప్రభుత్వ వ్యవసాయశాఖ ల్యాబ్‌లో నిర్ధారణ చేయాలని డిమాండ్ చేశారు. గద్వాల జిల్లాలో సీడ్ పత్తి పండించిన రైతులకు న్యాయం చేయాలని కోరారు. కంపెనీలు సీడ్ విత్తనాలను ఆర్గనైజర్ల ద్వారా కాకుండా వ్యవసాయ శాఖ నుంచి రైతులకు ఇచ్చేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. డీఎన్ఏ ఫింగర్ ప్రింట్ చేయించి మోసం చేసిన సీడ్ కంపెనీలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తిమ్మప్ప, నర్సింహులు, ఆంజనేయులు, వెంకట్‌రెడ్డి, కృష్ణ, శివ, అంజి, ఆంజనేయులు, గోవిందు, రాజు ఉన్నారు.



మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావుకు వినతి పత్రం అందిస్తున్న విజయ్, రైతులు



*నాగరికత ఎంత ముందుకు సాగినా.. సైన్స్ పరంగా ఎంత అభివృద్ధి సాధించినా.. నాగలి లేనిదే పని జరగదు.. దుక్కి దున్నందే తినడానికి తిండి కూడా దొరకదు.. రైతు లేనిదే పూట గడవదు, పట్టెడన్నం పుట్టదు.. జాతికి వెన్నెముకగా నిలిచిన రైతన్నలు జరుపుకొనే పండుగనే ఏరువాక పౌర్ణమి.. ఎంతో ప్రాముఖ్యత.. ప్రత్యేకతలు ఉన్న ఈ వేడుకను ఘనంగా జరుపుకొనేందుకు పల్లెలు సిద్ధమయ్యాయి. వర్షాలు సమృద్ధిగా కురిసి.. పంటలు బాగా పండాలని పిండి వంటలతో దేవతామూర్తులకు నైవేద్యాలు సమర్పించనున్నారు. పాడిపశువులను అందంగా ముస్తాబు చేసి సంబురాలు చేసుకోనున్నారు. మంగళవారం మార్కెట్‌లో రైతుల పండుగకు అవసరమైన సామగ్రిని కొనుగోలు చేయడంలో నిమగ్నమయ్యారు.*

*– గద్వాల టౌన్, జూన్ 10*

# నేడు ఏరొంకపున్నం

- రైతన్న పండుగకు ఉమ్మడి పాలమూరు జిల్లా సిద్ధం
- ఎన్నో విశిష్టతలకు ప్రతీక పౌర్ణమి
- అందంగా పశువుల ముస్తాబు.. ఏరువాక తాడు తెంచే కార్యక్రమం
- సామగ్రి కొనుగోలులో నిమగ్నమైన అన్నదాతలు

వ్యవసాయదారులు(రైతులు) ఏరువాక పండుగను జేష్ఠ్య పౌర్ణమి రోజు జరుపుకొంటారు. తెలుగు సంవత్సరంలో జేష్ఠ్యమాసం మూడో నెల. ఈ నెల మొదటి పక్షంలో రోహిణికార్తె తరువాత మృగశిర కార్తె వస్తుంది. ఈ కార్తెలో ఎండల ప్రభావం తగ్గి ముంగిళ్లు చల్లబడతాయన్న నానుడి ఉన్నది. అంతేకాదు జ్యేష్ఠపౌర్ణమి నాటికి తొలకరి పలుకరించక మానదు. ఇందుకు కృతజ్ఞత పూర్వకంగా జరుపుకొనే పండుగను కృషి పూర్ణిమ, మాల పూర్ణిమ, ఏరువాక పూర్ణిమ అంటారు.. ఏరువాక అంటే నాగలితో దుక్కి వ్యవసాయ పనులు ప్రారంభించడమన్న అర్థం ఉన్నది. ఆరుగాలం

రైతులకు అన్ని విధాలా అండగా ఉండి పంట పొలాల్లో తమతోపాటు శ్రమించే పశువులను ఏరువాక నాడు పూజిస్తే కాలం కలిసొస్తుందని ఓ నమ్మకం అందుకే రైతులు ఏరువాకను ఓ సంప్రదాయ పండుగగా జరుపుకోవడం అనాదిగా వస్తున్నది.

**జ్యేష్ఠ పూర్ణిమ విశిష్టత..**

నాగలి సారించి పనులు ప్రారంభించడానికి మంచి నక్షత్రం జ్యేష్ఠ అని జ్యోతిష్యశాస్త్రం చెబుతున్నది. ఈ నక్షత్రం చంద్రుడు కూడి ఉండే రోజు కావడం ఎంతో విశేషం. చంద్రుడు ఓషదులకు అధిపతి. ఓషదులు అనగ మంచు, ఎరువు, సూక్ష్మధాతువులు అని అర్థం. ఇవన్నీ ఉంటేనే వ్యవసాయం ఫలసాయాన్ని ఇస్తుందన్న నమ్మకం రైతుల్లో ఉన్నది. అందుకే రైతులు జ్యేష్ఠ పౌర్ణమి రోజు వ్యవసాయ పనులు ప్రారంభిస్తారు.

**పండుగ జరుపుకొనే విధానం**

ఆరుగాలం కష్టించే రైతన్నలకు తోడుగా వారి కష్టాల్లో భాగం పంచుకుంటూ అన్ని విధాలా అండగా ఉండే పశువులకు ఏరువాక పౌర్ణమి రోజు గ్రామాల్లో ఉదయాన్నే చెరువులు, కుంటల వద్దకు తమ ఎద్దులను తీసుకెళ్లి స్నానాలు చేయించి వాటి కొమ్ములకు రంగులను పూస్తారు. కాళ్లకు గజ్జెలు, మెడలో గంటలు, కుచ్చులు కట్టి శరీరం నిండా రంగులు అద్దుతారు. ఆర్థిక స్థోమత ఉన్న రైతులకు ఎద్దులను నూతన వస్త్రాలతో అలంకరించి ఇంట్లో ఉన్న గాటి వద్దకు తీసుకొస్తారు. పండుగ సందర్భంగా చేసిన పొంగలిని నైవేద్యంగా పెట్టి ఆ గాటికి దూప, దీపాలతో పూజలు చేసి చల్లంగా చూడమని వేడుకుంటారు. సాయంకాలం మంగళవాయిద్యాలతో ఊళ్లో ఉన్న పశువులన్నింటినీ ఒక దగ్గరకు చేరుస్తారు. అక్కడి నుంచి పశువుల ఊరేగింపు ప్రజల కేరింతల మధ్య కన్నుల పండువగా సాగుతుంది. ఎద్దులతోపాటు నాగలిని ఎర్రమట్టి, సున్నం పట్టెలతో అలంకరించి పొలం వద్దకు వెళ్తారు. ఈ ఏడాది రైతు కుటుంబంలో ఎవరి పేరుపైన బలం ఉందో వారు దుక్కిని దున్ని పొలం పనులు ప్రారంభిస్తారు.

**ఏరువాక తాడు తెంచడం..**

దుక్కి దున్నడానికి వెళ్లే ముందు ఊరి పొలిమెరలో పుంటి నారతో తోరణాన్ని కడతారు. ఆ తోరణానికి రూపాయలు, జిలేబీలు, గారెలు, గజ్జెలు తదితర వస్తువులను కట్టి అలంకరిస్తారు. వాటిని రైతులు చెర్నకోలతో కొడుతూ ఎవరికి దొరికిన వస్తువును వారు తీసుకెళ్తుంటారు. ఈ విధంగా చేయడం వల్ల పశువులకు మేలు కలుగుతుందని రైతుల నమ్మకం. దీనినే ఏరువాక తాడు తెంచడం అని అంటారు. ఈ ఆచారాన్ని, పండుగను విష్ణు పురాణంలో సీత యజ్ఞంగా పిలువబడేదని ప్రతీతి.

**పండుగకు సర్వం సన్నద్ధం**

ఏరువాక పండుగను ఘనంగా నిర్వహించేందుకు నడిగడ్డ ప్రజలు సన్నద్ధం అవుతున్నారు. దీంతో మంగళవారం జిల్లా కేంద్రంతోపాటు గ్రామాలు ప్రజలు, రైతులతో కళకళలాడుతూ కనిపించాయి. ఉత్సవాలకు సంబంధించిన వాటిని కొనుగోళ్లు చేయడంలో నిమగ్నం అయ్యారు. గ్రామ దేవతలకు సమర్పించేందుకు సంత రోజు కాకపోయిన కోళ్ల కొనుగోళ్లు కూడా జోరుగా సాగింది. అలాగే గ్రామ దేవతలైన సుంకులమ్మ, ఈదమ్మ అమ్మవార్ల ఆలయాలను ముస్తాబు చేశారు. స్థానిక చింతలపేటలో ఏరువాక తాడు తెంచే ఉత్సవాన్ని నిర్వహించేందుకు, ఎద్దుల ఊరేగింపు కావాల్సిన ఏర్పాట్లను నిర్వాహకులు దగ్గరుంచి చూస్తున్నారు.

### నాటుకోళ్లకు యమ డిమాండ్



అలంపూర్ చౌరస్తా, జూన్ 10 : ఏరువాక పౌర్ణమి సందర్భంగా ఉమ్మడి పాలమూరు జిల్లా వ్యాప్తంగా నాటుకోళ్ల గిరాకీ డిమాండ్ బాగా పెరిగింది. మటన్‌కు దీటుగా నాటుకోళ్లు కిలో రూ. వెయ్యి నుంచి 1200 పలకడంతో ప్రజలు ఏం చేయాల్లో తెలియక అయోమయానికి గురవుతున్నారు. జోగుళాంబ గద్వాల జిల్లాలో ప్రతి ఏరువాక పున్నమికి సుంకులమ్మ అమ్మవారికి గుడి ఎదుట నాటు కోళ్లను బలిచ్చే ఆనవాయితీ ఉండడంతో ప్రజలు కర్నూల్, రాయిచూర్ పరిసర ప్రాంతాల నుంచి, గ్రామాల్లో ఇండ్ల వద్ద పెంచుకుంటున్న నాటుకోళ్ల కోసం ఎగబడుతున్నారు. దీంతో నాటుకోళ్లు అమ్మేవారు ధరలను అమాంతం పెంచడంతో ప్రజలు గత్యంతరం లేక రూ.వేలు పెట్టి నాటుకోళ్లన్లు కొనుగోలు చేస్తున్నారు.

# కట్టని రుణం.. వేలానికి పొలం..

- అప్పుడు రుణమాఫీ చేయకుండా ఇబ్బందులు
- ఇప్పుడు రుణాలు చెల్లించని వారి భూములను వేలం వేసేందుకు సిద్ధమైన వైనం
- రూ.లక్షల్లో అప్పులున్న వారిని వదిలి రూ.వేలల్లో ఉన్న వారికి నోటీసులు
- పీఏసీసీఎస్‌తోపాటు గండీడ్, మహ్మదాబాద్ తాసీల్దార్ కార్యాలయాల వద్ద అంటించిన నోటీసులు
- ఆందోళనకు గురవుతున్న అన్నదాతలు

గండీడ్/మహ్మదాబాద్, జూన్ 10 : రాష్ట్రంలో ప్రజాపాలన సాగిస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మాత్రం తీవ్ర ఇబ్బందుల పాలు చేస్తున్నది. ముఖ్యంగా పీఏసీసీఎస్‌లో రుణాలు తీసుకున్న రైతులు సకాలంలో వాటిని చెల్లించకపోవడంతో వారి భూములను వేలం వేయనున్నట్లు ప్రకటించింది. ఇందుకు సంబంధించి పీఏసీసీఎస్ కార్యాలయంతోపాటు గండీడ్, మహ్మదాబాద్ తాసీల్దార్ కార్యాలయాల వద్ద వేలం వేసే భూములకు సంబంధించిన వివరాలను నోటీసు బోర్డుపై అంటించడమే వీరి ప్రజా పాలనకు నిలువుటద్దం పడుతున్నది. వివరాల్లోకి వెళితే గండీడ్, మహ్మదాబాద్‌కు చెందిన రైతులు సహకార సంఘంతోపాటు కోఆపరేటీవ్ బ్యాంకులలో వివిధ అవసరాల నిమిత్తం స్థిరాస్తి తాకట్టు పెట్టి రుణాలు తీసుకున్నారు. రుణాలు సకాలంలో చెల్లించనందున వారిపై డిక్రీ పొంది, ఈపీ ఫైల్ తయారు చేసి బకాయిపడ్డ రైతుల స్థిరాస్తి సంఘానికి తాకట్టు పెట్టబడంతో వారి భూములను వేలం వేయడానికి సిద్ధం అయ్యింది. ఉమ్మడి మండలంలో 14మంది రైతుల ఆస్తులు జప్తు చేయడానికి సిద్ధం కాగా సోమవారం ఆరుగురు రైతుల లిస్టును అధికారులు నోటీసు బోర్డుపై అంటించారు. అందులో మహ్మదాబాద్ మండలం నుంచి బాలవర్ధన్‌రెడ్డి (వెంకట్‌రెడ్డిపల్లి), మణిబాయి (తువ్వగడ్డతండా), రఘుకుమార్, శివమ్మ (దేశాయిపల్లి) గండీడ్ మండలం నుంచి మహేశ్వర్‌రెడ్డి, రాజ్‌కుమార్‌రెడ్డి (రుసుంపల్లి), మన్యానాయక్ (పగిడ్యాల్) గ్రామాల రైతులు భూములు వేలం వేస్తున్నట్లు సహకార సొసైటీ సిబ్బంది బహిరంగంగా నోటీసు బోర్డులపై అతికించారు. ఉమ్మడి మండలంలో రూ.20 వేల నుంచి 15 లక్షలు రుణం తీసుకున్న రైతులు 1130 మంది ఉండగా అందులో 750 మంది రైతులు బకాయిపడ్డట్లు సిబ్బంది చెబుతున్నారు. వీరికి మొదట నోటీసులు జారీ చేసిన అనంతరం డిమాండ్ నోటీసులు, సెక్షన్ 71నోటీసులు, ఈపీఐ వంటి నోటీసులు జారీ చేసి కోఆపరేటీవ్ సొసైటీ చట్టం ప్రకారం నోటీసులు జారీ చేసినట్లు అధికారులు పేర్కొంటున్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలనలో ఎన్నో ప్రయోజనాలతో కూడిన కార్యక్రమాలు చేపడుతున్నట్లు ప్రజలకు చెబుతూ ఆచరణలో రుణాలు చెల్లించని రైతుల ఆస్తులు జప్తు చేస్తామని, భూములు వేలం వేయాలని చెప్పడం ఎంత వరకు సమంజసం అని వివిధ గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేవలం రూ.వేలల్లో ఉన్న రైతుల పేర్లు మాత్రమే నోటీసు బోర్డులో పెట్టి రూ.లక్షలు ఉన్న వారి పేర్లుపెట్టక పోవటం ఏమిటనని రైతులు ప్రశ్నిస్తున్నారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో ఇలాంటి దుర్భర పరిస్థితులు ఎప్పుడూ చూడలేదని అంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమను ఆదుకోకపోతే మరణమే శరణ్యం అని రైతులు వాపోతున్నారు.



గండీడ్ పీఏసీసీఎస్ వద్ద రైతుల వివరాలను నోటీసు బోర్డుపై అంటిస్తున్న సిబ్బంది

### రైతులకు సమాచారం అందించాం

రుణ బకాయిలు పడ్డ రైతులకు ప్రతి వారానికోసారి సమాచారం అందించాం. సహకార సంఘంలో మొండి బకాయిలు ఉన్న రైతుల్లో మొదటి విడుతగా 14 మంది రైతులకు నోటీసులు ఇచ్చిన అనంతరం ఆరు మంది రైతుల భూములు వేలం వేస్తున్నట్లు ప్రకటించాం. బకాయిపడ్డ వారు దాదాపు 120 మంది దాకా ఉన్నారు. వారికి కూడా నోటీసులు సిద్ధం చేస్తున్నాం

**– ఆశన్న, సీఈవో, పీఏసీసీఎస్ గండీడ్**

### రుణాలు ఇవ్వలేక పోతున్నాం

ఉమ్మడి మండలంలో చాలా మంది రైతులు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించడం లేదు. రుణాలు చెల్లించాలని లీగల్ అన్ని రకాల నోటీసులు ఇచ్చినా వారు స్పందించకపోవడంతో భూములు వేలం వేసేందుకు సిద్ధమయ్యాం. జూన్‌లో 50 శాతం రికవరీ అయితేనే కొత్త వారికి రుణాలు ఇచ్చేందుకు అవకాశం ఉంటుంది.

**– వెంకటయ్య, కోఆపరేటీవ్ బ్యాంక్ మేనేజర్, మహ్మదాబాద్**

### రిపీట్ ఇవ్వమంటే ఇవ్వడం లేదు

వన్‌టైం సెటిల్‌మెంట్ కింద 30 శాతం రిపీట్ అడిగాము. సొసైటీ సిబ్బంది ఇవ్వలేదు. రిపీట్ ఇస్తే మొత్తం లోన్ కట్టడానికి సిద్ధం అని కూడా చెప్పినా వినకుండా భూమి వేలం వేస్తున్నట్లు నోటీసు బోర్డుపై వేయడం ఎంతవరకు సమంజసం. ఇది కక్షపూరితంగా వ్యవహరిస్తున్నట్లు ఉన్నది.

**– డీ రఘుకుమార్, రైతు, దేశాయిపల్లి, మహ్మదాబాద్ మండలం**

### రెండువారోల్లో చెల్లిస్తామన్నాం

రెండు మూడు వారాల్లో రుణం మొత్తం చెల్లిస్తామని అధికారులకు చెప్పినా వినకుండా మా పేర్లు నోటీసు బోర్డుపై ఉంచారు. నేను లోన్ కట్టను అని ఎప్పుడూ చెప్పలేదు. ఇలా భూములు వేలం వేయడం, ఇండ్లకు తాళాలు వేయడం మా తాతల కాలంలో చూశాం. తీరా మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వంలో చూడాల్సి వచ్చింది.

**– బాలవర్ధన్‌రెడ్డి, రైతు. వెంకట్‌రెడ్డిపల్లి. మహ్మదాబాద్ మండలం**

## దళితులపై దాడులను సహించం

- అంతరాలు లేని సమాజాన్ని నిర్మిద్దాం
- ఇథనాల్ కంపెనీ ఏర్పాటుపై నివేదిక ఇవ్వాలి
- రాజోళి ఎస్సైపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలి
- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య, సభ్యులు





గద్వాల కలెక్టరేట్‌లో మాట్లాడుతున్న కమిషన్ చైర్మన్ వెంకటయ్య, చిత్రంలో సభ్యులు, అధికారులు

గద్వాల, జూన్ 10 : దళితులపై దాడులు చేస్తే సహించేది లేదని, వారు ఎంతటి వారైనా శిక్షించాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఆదేశించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ బాధితుల సమస్యలు, ప్రభుత్వం అభివృద్ధి చేస్తున్న సంక్షేమ పథకాల అమలు తీరుపై చర్చించేందుకు కలెక్టర్ సంతోష్ అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి చైర్మన్‌తోపాటు కమిషన్ సభ్యులు ప్రవీణ్‌కుమార్, నీలాదేవి, లక్ష్మీనారాయణ, రాంబాబు, శంకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా దళిత, ప్రజా సంఘాల నాయకులు జిల్లాలో దళితులపై జరుగుతున్న దాడులు, ఎదుర్కొంటున్న కుల వివక్ష, అక్రమంగా నమోదు చేస్తున్న కేసులు, గ్రామాల్లో రెండు గ్లాసుల పద్ధతి, కుల వివక్షత గురించి కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. అందుకు స్పందించిన చైర్మన్ వెంకటయ్య, సభ్యులు మాట్లాడారు. జిల్లాలో అంతరాలు లేని సమాజాన్ని నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. దళితులకు సంబంధించి సబ్‌ప్లాన్ నిధులు వారికే ఖర్చు చేయాలని ఆదేశించారు. దళితుల సబ్‌ప్లాన్‌కు సంబంధించిన నిధులు ఇతర వాటికి మళ్లించే అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో ఇప్పటి వరకు ఎన్ని కులాంతర వివాహాలు జరిగాయని, ఎంత మంది ఖాతాలో నగదు జమచేశారని ఆ శాఖాధికారిని ప్రశ్నించారు. 59 మంది పేర్లు నమోదు చేసుకోగా ఇప్పటి వరకు ఆరు మంది లబ్ధిదారులకే మాత్రమే నగదు జమ చేసినట్లు చెప్పారు. ఎస్సీ, ఎస్టీ పెండింగ్ కేసులు నెల లోపు అన్ని పరిష్కరించాలని ఎస్పీని ఆదేశించారు. గ్రామాల్లో కుల వివక్షతను రూపుమాపడానికి ప్రతినెలా పౌరహక్కుల దినోత్సవం నిర్వహించాలని సూచించారు. జిల్లా నుంచి విదేశీ విద్య పథకం కోసం ఒక్కరే దరఖాస్తు చేసుకోవడంపై విస్మయం వ్యక్తం చేశారు. అవగాహన లేకపోవడం వల్లే దరఖాస్తు చేసుకోలేక పోతున్నారని, అధికారులు దృష్టి పెట్టాలన్నారు. ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ యువవికాసం పథకాల్లో ఎస్సీ, ఎస్టీ కోటా పూర్తి స్థాయిలో ఖచ్చితంగా అమలు చేయాలని అధికారులకు ఆదేశించారు.

**పరిశ్రమ ఏర్పాటుపై పూర్తి నివేదిక ఇవ్వాలి**

పచ్చని పంటలను బీడు భూములుగా మార్చే ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటుపై కమిషన్ చైర్మన్ ఆరా తీశారు. పరిశ్రమ ఏర్పాటు చేసే సమయంలో ప్రజల అభిప్రాయాలు సేకరించారా? గ్రామ సభలు నిర్వహించారా? అని కలెక్టర్ సంతోష్‌ని ప్రశ్నించారు. పరిశ్రమ ఏర్పాటుకు సంబంధించి పూర్తి వివరాలను తమకు నివేదిక రూపంలో సమర్పించాలని కలెక్టర్‌ను ఆదేశించారు. అదేవిధంగా రాజోళి మండలం నసనూర్ గ్రామ శివారులో సర్వే నెంబర్ 35లో తమకు భూమి ఉన్నదని, అన్నదమ్ముల మధ్య గొడవలు ఉండగా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే న్యాయం చేయకుండా రాజోళి ఎస్సై కులం పేరుతో దూషించారని, నాపై తప్పుడు కేసు నమోదు చేయడానికి యత్నించారని చిన్న ధన్వాడకు చెందిన రాజశేఖర్ కమిషన్ దృష్టికి తీసుకొచ్చారు. అలాగే ఇథనాల్ ఫ్యాక్టరీతో తమకు ప్రమాదం ఉన్నదని, అందుకే 12గ్రామాల ప్రజలు వ్యతిరేకిస్తే కంపెనీ యాజమాన్యం బౌన్సర్లతో రైతులపై దాడులకు ప్రేరేపించడంతో.. దీంతో మరియమ్మ అనే మహిళకు తీవ్రగాయాలయ్యాయని, ఈమెతో పాటు ఎందరిపైనే దాడి చేయించడంతోపాటు అక్రమ కేసులు నమోదు చేశారని బీఆర్ఎస్ యూత్ వింగ్ నాయకులు మల్లికార్జున్, శ్రీనివాసులు, సత్యం, చిన్నయాదవ్, వీరేశ్, అనిల్, గట్టన్న, అంజి విన్నవించారు. స్పందించిన కమిషన్ రాజోళి ఎస్సైపై విచారణ చేయించి నివేదిక ఇవ్వాలని ఎస్పీని ఆదేశించారు. గద్వాల డీఎస్పీ మొగులయ్యను నియమిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగ్‌రావు, అధికారులు రమేశ్‌బాబు, ఉమాదేవి, సునంద, సక్రియానాయక్, గోవిందయ్య, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# మా వాళ్లు జైలులో ఉంటే.. పండుగ ఎలా చేసుకుంటాం?

- ఇథనాల్ ఫ్యాక్టరీ రద్దయిన రోజే మాకు అసలైన పండుగ
- ఏరువాక పౌర్ణమి నిర్వహించొద్దని పెద్ద ధన్వాడ, చిన్న ధన్వాడ గ్రామాల రైతుల సమిష్టి నిర్ణయం

రాజోళి, జూన్ 10 : వ్యవసాయ పనులు చేసే రైతులు ఏరువాక పౌర్ణమిని ప్రత్యేకంగా నిర్వహించే పండుగ. కానీ రాజోళి మండలంలోని పెద్ద ధన్వాడ, చిన్న ధన్వాడ తదితర గ్రామాలకు చెందిన రైతు కుటుంబాలకు ఇథనాల్ కంపెనీ ఓ శనిలా దాపురించింది. ఇథనాల్ ఫ్యాక్టరీ పెట్టొద్దు మా భూములను విషపూరితం చేయొద్దన్న పాపానికి చాలా మంది రైతులపై అక్రమ కేసులు బనాయించి జైలులో పెట్టారు. మరికొంత మందిని కూడా పోలీసులు అరెస్టు చేస్తారనే సమాచారం ఉండడంతో రైతులు ఎప్పుడు ఏం జరుగుతుందోని ఆందోళనకు గురవుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఈ సారి ఏరువాక పౌర్ణమి నిర్వహించుకోవద్దని నిర్ణయించుకున్నారు. ఈ మేరకు మంగళవారం పెద్ద ధన్వాడలో రైతులు సమావేశమై ఈ సారి ఏరువాక పౌర్ణమిని ఎవరూ చేసుకోవద్దని, మన వాళ్లపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేసి విడుదల చేయడంతోపాటు ఇథనాల్ ఫ్యాక్టరీ రద్దు అయ్యాక పండుగ చేసుకుందామని సమిష్టిగా నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ అధికారులు మా గ్రామాల్లో విషపూరిత కంపెనీలకు అనుమతులు రద్దు చేస్తూ పచ్చటి భూముల్లో పండిన పంటలు ప్రజల ఆకలి తీర్చేందుకు సహకరించాలని కోరారు. అయితే ఇథనాల్ ఫ్యాక్టరీ రద్దయ్యేంత వరకు గ్రామాల్లో ఏ పండుగను జరుపుకోకూడదని నిర్ణయించినట్లు వారు ప్రకటించారు.



పెద్ద ధన్వాడలో సమావేశమైన ఇథనాల్ బాధిత గ్రామాల రైతులు

### సఫారీ యాత్రికులకు కనిపించిన చిరుత

అచ్చంపేట/అమ్రాబాద్, జూన్ 10 : నల్లమలలో సఫారీ యాత్రికులకు ఉదయం చిరుతపులి కనిపించింది. మంగళవారం ఉదయం పర్యాటకులు సఫారీ వా హనంలో వ్యూపాయింట్‌కు వెళ్తుండగా శికార్ ఘర్ వద్ద రోడ్డుపై అడ్డం గా చిరుతపులి కనిపించడంతో యాత్రికులు తమ కెమెరాలో ఫొటోలు బం ధించారు. ఈ మధ్యకాలంలో పులులు, చిరుతపులులు, అడవిదున్న ఇతర వన్యప్రాణులు సఫారీ యాత్రికులు, పర్యాటకులకు దర్శనమిస్తున్నాయి. నల్లమలలో మొదటిసారి ముందునుంచి చిరుతపులి చూశామని పర్యాటకులు సంతోషం వ్యక్తం చేశారు.

**ఫొటోలు తీసి సంతోషపడిన యాత్రికులు**



నల్లమలలో కనిపించిన చిరుత